సాక్షి నిజామాబాద్

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



మానవ సేవకు కేరాఫ్..

మానవ సేవకు కేరాఫ్ అడ్రస్‌గా ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నిలుస్తోందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు.

- 8లో ▸



ఈతరాక.. ఊపిరాడక..

ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, నిఖిల్ నీట మునిగి ఊపిరాడక చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

- 8లో ▸



వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న రైల్వే గేట్ మరమ్మతులు



నవీపేట: నవీపేట మండల కేంద్రంలో బాసర రహదారిపై గల ప్రధాన రైల్వే గేట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈ నెల 26న ప్రారంభమైన పనులు 30 వరకు కొనసాగనున్నాయి. దీంతో నిజామాబాద్ నుంచి బాసర రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకుగా ఉన్న దర్యాపూరు చెరువు కట్టపై నుంచి రాకపోకలు సాగించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల భిక్షాటన



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 22వ రోజు సమ్మెలో భాగంగా ఉద్యోగులు శనివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి కోర్టు చౌరస్తా వరకు భిక్షాటన చేశారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా షాపులలో, పాదాచారులను భిక్షం అడిగి నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మెను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె రాజు, భూపేందర్లు పేర్కొన్నారు. పదిహేను ఇరవై సంవత్సరాల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు క్రమశిక్షణతో పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో తెలపాలన్నారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని లేని పక్షంలో ఉద్యమం మరింత తీవ్రతం చేస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి ప్రసాద్ , మహిళా అధ్యక్షురాలు గంగామణి, సుప్రజా, రాజు విద్యాసాగర్, పవిత్రన్, అప్సర్ ,సంతోష్, గిరీష్, రమేష్, మోహన్, జలంధర్, రాజమణి, రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు

నిజాం షుగర్స్‌కు అడుగులు

- ముందుకు సాగని జక్రాన్‌పల్లి విమానాశ్రయం ప్రతిపాదనలు
- రైతులకు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్
- మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల అమలు, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ ప్రారంభం
- పూర్తికావొచ్చిన సమగ్ర కుటుంబ సర్వే
- నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు
- ఉపాధ్యాయ నియామకాలు..





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో ఆసియా ఖండంలోనే ప్రఖ్యాతి గాంచిన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల ప్రారంభ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కమిటీ ఏర్పాటు చేసింది. ప్రైవేటు యాజమాన్యం పరిధిలో ఉన్న ఈ ఫ్యాక్టరీకి రూ.400 కోట్ల బ్యాంకు అప్పులు ఉండగా, ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.190 కోట్లు చెల్లించింది. ప్రత్యేక కమిటీ విడతల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించింది.

✤ అధికారుల నిర్లక్ష్యం మూలంగా రూ.417 కోట్ల విలువజేసే కస్టమ్ మిల్లింగ్ రైసును మిల్లర్లు ఇవ్వడం లేదు. డిఫాల్ట్ రైసు మిల్లర్లపై చర్యలు తీసుకోవడంలో అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు.

✤ కొత్త ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశారు. 602 మందికి ఉద్యోగాలు వచ్చాయి. సాంకేతిక తప్పిదం జరిగిందంటూ నలుగురి వద్ద నుంచి నియామక పత్రాలను అధికారులు తిరిగి తీసుకున్నారు.

✤ జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం తీర్మానం చేసింది.

రుణమాఫీ



✤ రాష్ట్ర ప్రభుత్వం 1,00,612 మంది రైతులకు రూ.782.31 కోట్లు రుణమాఫీ చేసింది. ఈ ఏడాది వానాకాలంలో 5.52 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. జిల్లాలో సన్నవడ్ల బోనస్ కింద 48,500 మంది రైతులకు రూ.158 కోట్లు ఖాతాల్లో జమ చేసింది. మరో రూ.35 కోట్లు బోనస్ చెల్లించాల్సి ఉంది.

మరోవైపు జిల్లాకు నవోదయ పాఠశాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. తెలంగాణ యూనివర్సిటీ వీసీగా ఆచార్య యాదగిరి రావు నియమితులయ్యారు. సంక్షేమ, గురుకుల పాఠశాల మెనూ చార్జీలను ప్రభుత్వం భారీగా పెంచింది. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మెరుగులు దిద్దారు. జిల్లాలో 1192 పాఠశాలలు ఉండగా 792 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.39.38 కోట్లు కేటాయించారు.

✤ మహాలక్ష్మి పథకంలో భాగంగా నిజామాబాద్ రీజియన్ పరిధిలో 1,69,73,712 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారు. ఆర్టీసీకి రూ.55.44 కోట్ల ఆదాయం సమకూరింది.

✤ నవంబర్ 6 నుంచి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. నివాస గృహాలను 3,245 బ్లాక్‌లుగా విభజించి 3,343 మంది ఎన్యుమరేటర్లు , 370 మంది సూపర్‌వైజర్లు సర్వే చేశారు. 75 అంశాలు, 56 కాలమ్స్‌లో ఈ సర్వే నడిచింది.

✤ జిల్లాకు 108 అంబులెన్స్‌లు తొమ్మిది వచ్చాయి. జీజీహెచ్‌లో కొత్తగా 102 మంది రెగ్యులర్ స్టాఫ్ నర్సులు విధుల్లో చేరారు. మాత శిశుసంరక్షణ కేంద్రంతో పాటు, క్రిటికల్ కేర్, ఎస్‌సీడీ కేంద్రాలను ప్రారంభించారు.

• గృహజ్యోతి



✤ 2,650 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఇచ్చారు. జిల్లాలో మొత్తం 1,85,000 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గృహజ్యోతి కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సౌకర్యానికి 2,79,000 గృహాలను గుర్తించారు. ఇందులో 2,50,000 గృహాలకు మాత్రమే పథకాన్ని అమలు చేస్తున్నారు. నెలకు రూ.10 కోట్ల చొప్పున ప్రభుత్వం కేటాయిస్తోంది. జిల్లాలో ఓవర్‌లోడ్, విద్యుత్ కోతలను నివారించేందుకు 33/11 సబ్‌స్టేషన్లు కొత్తగా మంజూరు చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు



✤ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం మొదటి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారిని గుర్తించి ఇంటింటి సర్వే చేస్తున్నారు.

✤ ఆరోగ్యశ్రీ కింద 24,804 మందికి వివిధ రకాల ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందించారు. ఇందుకు రూ.55.72 కోట్లు ఖర్చు చేశారు. వైద్యఆరోగ్య శాఖలో కొత్తగా 13 మంది మెడికల్ ఆఫీసర్లు, 40 మంది స్టాఫ్ నర్సులు విధుల్లో చేరారు. కాంట్రాక్టు పద్ధతిలో 13 మంది ఎమ్ఎల్‌హెచ్‌పీ, 30 మంది సాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేశారు. కొత్తగా ఆర్మూర్‌లో ఒక సబ్ సెంటర్ ఏర్పాటు చేశారు. చందూర్‌లో సబ్‌సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

▪ విమానాశ్రయం కోసం



జిల్లాలోని జక్రాన్‌పల్లి వద్ద ప్రతిపాదిత విమానాశ్రయం కోసం ఓఎల్ఎస్ సర్వే చేసి కేంద్రానికి నివేదిక ఇవ్వాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.



✤ 967 చెరువుల్లో 2.27 లక్షల చేప పిల్లలు పోయాలని లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు 78 శాతం పంపిణీ పూర్తి చేశారు. హరితహారం కింద గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 25.11 లక్షల మొక్కలు నాటారు. బ్యాంకు లింకేజీ రుణాలు రూ.1228.71 కోట్లు 20,350 మహిళా సంఘాలకు అందించే లక్ష్యానికి గాను రూ.931.06 కోట్లు, 11360 మహిళా సంఘాలకు అందించారు. శ్రీనిధి పథకం ద్వారా రూ.211 కోట్లు మహిళా సంఘాలకు రుణాలు అందించే లక్ష్యానికి ఇప్పటివరకు రూ.120 కోట్లు అందించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 46 లక్షల పని దినాలు పూర్తికాగా, రూ.91 కోట్లు కూలీలకు చెల్లించారు.



రుణమాఫీతో కేట్ కట్ చేస్తున్న రైతులు

ఎస్సారెస్పీ



✤ శ్రీరాంసాగర్ జలాశయం పూడిక తీత కోసం ప్రపంచస్థాయి సాంకేతికత ఉపయోగించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాగా ఈ ఏడాది ప్రారంభంలో జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీల నుంచి 80.5 టీఎంసీలకు తగ్గినట్లు అధికారులు నిర్ధారించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మంచిప్ప వద్ద జలాశయాన్ని 3.5 టీఎంసీల సామర్థ్యం నుంచి 0.8 టీఎంసీలకు తగ్గించారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా చైతన్యం కావాలి

- ముదిరాజ్‌లకు మత్స్యసహకార సంఘాల్లో సభ్యత్వం కల్పించాలి
- తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్



మాట్లాడుతున్న తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న ముదిరాజ్ కులస్తులు రాజకీయంగా చైతన్యం కావాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 14.7 శాతం ఉన్న ముదిరాజ్ లకు చట్టసభల్లో, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎలాంటి లబ్ధి చేకూరడం లేదన్నారు. ఇతర బీసీ కులాల వారితో కలిసి ముదిరాజ్‌లు రాజకీయంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో 46 వేల చెరువులు, కుంటలు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుతో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 6 జారీచేసింది. అయితే రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాతో పాటు కొన్ని జిల్లాలలో అధికారులు జీవో నెంబర్ 6 ను అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముదిరాజ్‌లకు గంగపుత్రులతో పాటు మత్స్యకార సహకార సంఘాలలో సభ్యత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేపల పెంపకం కుటీర పరిశ్రమగా మారిస్తే ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. కేజ్ కల్చర్ కోసం తాము ప్రభుత్వానికి విన్నవిస్తే ఉన్నతాధికారులు మాత్రం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 14 డిమాండ్ లతో కూడిన వినతి పత్రం అందజేశామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009 లో ముదిరాజ్ లను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్‌కు మార్చాలని జీవో నెంబరు 15 జారీ చేశారని తెలిపారు. ఆయన హఠాన్మరణం తర్వాత ఆ జీవోను అమలు చేయకపోవ డం దారుణమన్నారు. ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా అన్ని పార్టీల వారు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇతర బీసీ కులాల వారితో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థుల ఓటమికి ప్రయత్నిస్తామని శంకర్ ముదిరాజ్ హెచ్చరించారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి శివన్న మాట్లాడుతూ బీసీ కమిషన్, డెడికేటెడ్ కమిటీలను కలిసి ముదిరాజ్ సమస్యలు, డిమాండ్లపై వినతిపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ, జిల్లా అధ్యక్షుడు యాసాడ నర్సింగ్, ముదిరాజ్ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు సతీష్ , జిల్లా నాయకులు సంగమేశ్వర్, ఎల్లన్న, నారాయణ, ప్రసాద్, శ్రీనివాస్, సత్యనారాయణ, మురళి, బోజన్న, జనార్దన్, రాజేశ్వర్, కార్తీక్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులది ప్రత్యేక స్థానం

- ఐక్యతతోనే పీఎంపీ, ఆర్‌ఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు సాధ్యం
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఆరోగ్య తెలంగాణలో గ్రామీణ వైద్యులది ప్రత్యేక స్థానమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలందిస్తున్న పీఎంపీ,ఆర్‌ఎంపీ డాక్టర్ల ఐక్యత, ప్రజల నుంచి లభించే మద్దతు ద్వారా ప్రభుత్వం నుంచి గుర్తింపు సాధ్యపడుతుందన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని అమృతాగార్డెన్స్‌లో ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ మహాసభ జరిగింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి సుమారు వేయి మందికి పైగా పీఎంపీ, ఆర్‌ఎంపీ వైద్యులు హాజరయ్యారు. కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

వైద్యుడు లేని చోట వైద్యం అందించే ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి అని అన్నారు. గ్రామీణ వైద్యులు హద్దులు దాటి వైద్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు రమేష్, అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, తెలంగాణ పీఎంపీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పుల్గం మోహన్, ఉపాధ్యక్షులు రవివర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి పోశాద్రి, లక్ష్మీరాజం, వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన హక్కుల గొంతు

- గుండెపోటుతో మృతి చెందిన ప్రముఖ న్యాయవాది మాధవరావు
- బూటకపు ఎన్‌కౌంటర్‌లపై కేసులు వేసి దేశ చరిత్రలో నిలిచారు
- పేదలు, ఉద్యమ కారులకు ఉచిత న్యాయ సేవలు అందించారు
- నివాళులు అర్పించిన మానవహక్కుల వేదిక, వామపక్షాల నేతలు



మాధవరావు మృతదేహానికి నివాళ్లు అర్పిస్తున్న మానవహక్కుల వేదిక నేతలు



మాధవరావు

ఖలీల్‌వాడి: ప్రముఖ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు (67) శనివారం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందారు. జీవిత కాలం ఆయన మానవ హక్కులు, పౌరహక్కుల కో సం పోరాటం చేశారు. పేదల తరపున, ఉద్యమ కేసులను ఉచితంగా వాదించేవారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ కారులు, విద్యార్థులపై పెట్టిన కేసులపై వాదించి ఉద్యమానికి సహకారంగా అందించారు. లా పూర్తి చేసిన తర్వాత చాలా మంది అప్రెంటిస్ చేసేవారికి గొర్రెపాటి మాధవరావు కేసులకు సంబంధించిన వివరాలను వాటిని ఎలా ఫేస్ చేయాలో వివరించేవారు. పోలీసుల రెండు బూట కపు ఎన్‌కౌంటర్లపై కోర్టులో కేసులు వేసి దేశ చరిత్రలో నిలిచారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం ఇప్పించారు. మరొక వ్యక్తిని దొంగతనం కేసులో బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తే బాధితుల తరపున వాదించి రూ. లక్ష నష్టపరిహారం ఇప్పించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.

▪ నగరంలోని ద్వారకా నగర్, శ్రామిక నగర్ గూడెంలలోని గుడిసె వాసులకు, కోటగల్లీ వాసుల ఇంటి స్థలాల కోసం పోరాడి పట్టాలు ఇప్పించారు. ఉద్యమకారులపై పెట్టిన ఔరంగాబాద్ కుట్ర కేసు వాదించి గెలిచారు. మాధవరావుకు ప్రభుత్వ ప్లీడరుగా అవకాశం వచ్చినా తిరస్కరించి, బాధితుల తరపున న్యాయవాదిగా పని చేశారు. పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా 1983 నుంచి 1996 వరకు పని చేశారు. హక్కుల నేత బాలగోపాల్‌తో కలిసి 2004 నుంచి మానవహక్కుల వేదికలో భాగస్వామ్యం అయ్యారు. మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర మొదటి అధ్యక్షుడిగా 2019 నుంచి 2023గా పని చేశారు. హక్కులకు భంగం కలిగిన ప్రతి చోటా నిజనిర్ధారణ కమిటీలు వేసి నివేదికలు రాసేవారు. నిజామాబాద్‌లో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ స్మృతిలో ఏర్పాటు చేసిన ట్రస్ట్‌కు మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నారు. అనేక పత్రికలకు వ్యాసాలు, పుస్తకాలు రాశారు. అనేక ప్రజాసంఘాల కార్యకర్తలకు తరగతులు బోధించారు. తెలంగాణ యూనివర్సిటీలో మొదటి తరం న్యాయశాస్త్ర విద్యార్థులకు తరగతులు బోధించారు.

▪ గొర్రెపాటి మాధవరావు రచనలు పదునైనవి. ముఖ్యమైన రచనలు ఆచరణలో గతి తర్కం (డిడి కోశాంబీ రాసింది తెలుగులోకి అనువాదం), కార్మిక చట్టాలు, ఆధునిక చైనా విప్లవం, విశ్వ మానవ హక్కుల ప్రకటన (ఐక్యరాజ్యసమితి మానవహక్కుల పత్రం తెలుగులోకి), జాతీయత లేని జాతీయ కాంగ్రెస్ (తెలుగు అనువాదం) చేశారు.

▪ మాధవరావు పార్థివ దేహాన్ని ఆదివారం నిజామాబాద్ మెడికల్ కళాశాలకు, కళ్లను లయన్స్ క్లబ్‌కు అందించనున్నారు. అంతకు ముందు ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని కోటగల్లీ నుంచి గొర్రెపాటి మాధవరావు పార్థివ దేహం యాత్ర ఉంటుంది. గొర్రెపాటి మాధవరావు పార్థివ దేహానికి మానవహక్కుల వేదిక నాయకులు వసంతలక్ష్మి, శాస్త్రవేత్త బాబూరావు, సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు వి ప్రభాకర్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, వేల్పూరు భూమయ్య, పరుచూరి శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్‌మోహన్‌గౌడ్, పౌరహక్కుల సంఘం నాయకులు వాల్గొట్ రవీందర్, వి. సంఘం, కొంగర శ్రీనివాస్‌రావు తదితరులు నివాళులు అర్పించారు.

జనవరి 2న ఏకసభ్య కమిషన్ రాక

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణ కోసం హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ తో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ జనవరి2 న ఉదయం 11 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి (కలెక్టరేట్) రానుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, షెడ్యూల్డు కుల సంఘాల నాయకులు, ఇతర ఉద్యోగులు, ఎస్సీ కులానికి చెందిన అన్ని వర్గాల వారు ఏకసభ్య కమిషన్‌కు వినతులు అందజేయాలని కోరారు. కమిషన్ కు నిర్ణీత నమూనాలో సమర్పించాల్సిన దరఖాస్తు ఫారాలు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ సహాయ షెడ్యూల్డ్ కులాల అభివద్ధి అధికారి కార్యాలయాలలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ఎన్నిక

సుభాష్‌నగర్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీలో శనివారం జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి సంఘం సెంట్రల్ ఫోరం సభ్యురాలు జి.భారతి, నరేందర్ సమక్షంలో కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంఎస్ఎన్ చారి, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా నాగరాజు ఎన్నికయ్యారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్: వివిధ కేసుల్లో ఎక్సైజ్ శాఖకు పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు వాహనాలను ఈనెల 30న ఉదయం 10గంటలకు వేలం వేస్తామని, ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

సౌత్‌జోన్ ఖోఖో క్రీడాపోటీల్లో తెయూ జట్టు



తెయూ(డిచ్‌పల్లి): తమిళనాడు రాష్ట్రంలోని సెంట్రల్ యూనివర్సిటీ వేదికగా కొనసాగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో తెలంగాణ యూనివర్సిటీ జట్టు పాల్గొంటోంది. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు పోటీలు కొనసాగుతుండగా, శనివారం రోజున మహాత్మా గాంధీ యూనివర్సిటీ జట్టుతో తెలంగాణ యూనివర్సిటీ జట్టు తలపడి ఓటమిపాలైంది.

జనవరి 11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జనవరి 11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 నుంచి 17వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయని, డ్రాయింగ్, హయ్యర్ డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. త్వరలో హాల్ టికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు.

ఈతరాక.. ఊపిరాడక..

- ఎస్సై సాయికుమార్‌తో పాటు మరో ఇద్దరిదీ అదే పరిస్థితి
- మూడు మరణాల కేసులో కొనసాగుతున్న విచారణ



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో ఎస్సై, కానిస్టేబుల్, మరో యువకుడు మునిగి చనిపోయిన సంఘటనకు సంబంధించి పోలీసు అధికారులు విచారణ ముమ్మరం చేశారు. వారి మరణానికి గల కారణాలతో పాటు ఆ రోజు ఏం జరిగిందన్న దానిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. చెరువు నీటిలో ముగ్గురు పడిపోవడంతో జాలర్ల సాయంతో గాలించి వారి మృతదేహాలను బయటకు తీసిన విషయం తెలిసిందే. కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌లను పరిశీలించిన అధికారులు.. శ్రుతి, నిఖిల్‌లు పెళ్లి చేసుకోవాలనుకున్నారని గుర్తించారు. తర్వాత వారి మధ్య విభేదాలు ఎందుకు వచ్చాయోనన్న దాని గురించి ఆరా తీస్తున్నారు. వారు చెరువు వద్దకు వెళ్లి అక్కడ చర్చించుకున్న సమయంలో, చెరువులో దూకినపుడు ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేకపోవడంతో అక్కడ ఏం జరిగిందన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు. దాదాపు రెండు కిలోమీటర్ల పొడవైన చెరువు కావడంతో ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా ఎక్కడా లేవు. ఆ రోజు చేపల వేటకు ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లకపోవడంతో ఈ ఘటన ఎవరి కంటా పడలేదని భావిస్తున్నారు.

వివిధ కోణాల్లో దర్యాప్తు

ముగ్గురి మరణాలపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాల్‌డేటాను పరిశీలించిన అధికారులు వాట్సాప్ చాటింగ్‌లపై దృష్టి సారించారు. అయితే ఫోన్లు లాక్ అయి ఉండడంతో వాటిలో నుంచి సమాచారం తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్పీ సింధుశర్మ కేసు పరిశోధన గురించి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా కేసు దర్యాప్తు గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. సాక్ష్యాధారాలు లేకపోవడంతో సాంకేతిక అంశాల ఆధారంగా కేసును కొలిక్కి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. కేసు కొలిక్కి రావడానికి మరికొన్ని రోజుల సమయం పట్టవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నీరు మింగి..

భిక్కనూరు ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, అలాగే నిఖిల్ నీట మునిగింది లోతైన ప్రదేశంలో కావడంతో అందులో పడగానే లోపలికి వెళ్లిపోయి ఉంటారని భావిస్తున్నారు. ముగ్గురి మృతదేహాలు దొరికిన ప్రదేశం దాదాపు పదిమీటర్ల లోతు ఉంటుందని అంటున్నారు. ముందు ఎవరో ఒకరు దూకి ఉంటారని, వారిని కాపాడే క్రమంలో మి గతా ఇద్దరూ ఒకరి వెంట ఒకరు దూకి ఉంటార ని అంచనా వేస్తున్నారు. అయితే ముగ్గురికీ ఈత రాదని తెలుస్తోంది. లోతైన ప్రాంతంలో దూకడంతో ముగ్గురూ నీట మునిగి చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టుల్లో నీళ్లు మింగే చనిపోయారని వెల్లడైంది.

మాదారి రాజన్నకు డాక్టరేట్



ఆర్మూర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మాదరి రాజన్నకు తమిళనాడులోని హోసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేశారు. పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర మాజీ అసోసియేట్ ప్రెసిడెంట్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా మాదారి రాజన్న అందించిన సేవలకుగాను గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. డాక్టర్ కరాటే ఏపీ శ్రీకాంత్, డాక్టర్ కేఎస్ వేణుగోపాల్, డాక్టర్ అరుణ్ చిన్న దురై, డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్, డాక్టర్ చప్పిడి నాగఫణిశ్రీ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన డాక్టరేట్‌ను రాజన్న అందుకున్నారు.

విజయసాయిలో ఆత్మీయ సమ్మేళనం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని విజయసాయి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. మూడు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా వారు సన్మానించి ఆశీర్వచనాలు పొందారు. ముఖ్యఅతిథిగా హాజరైన కామశాస్త్రి మాట్లాడుతూ.. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గౌరవించాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ భావాలను పంచుకున్నారు. ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మేనేజర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కామశాస్త్రి



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చిగురాకుల్లో ఎన్నెన్ని అందాలో..



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని జక్కాపూర్ గ్రామ శివారులోని ఓ పంట చేనులో మామిడి చెట్టు రంగు రంగు అందాలతో చూపరులను ఆకట్టుకుంటుంది. పచ్చని పంటచేనులో మామిడిచెట్టుకు పూతతోపాటు కొమ్మ లు చిగురాకులతో మూడు రంగులతో దర్శన మిస్తున్నాయి. ఈ చెట్టును అటుగావెళ్లే వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మానవ సేవకు కేరాఫ్ ఇందూరు యువత



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



హాజరైన విద్యార్థులు, నగర ప్రజలు

నిజామాబాద్ నాగారం: మానవ సేవకు కేరాఫ్ అడ్రస్‌గా ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నిలుస్తోందని, అనాథలకు అండగా నిలవడం అభినందనీయమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు మద్దుకూరి సాయిబాబు ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ 13వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై నిస్సహాయస్థితిలో ఉన్న అనాథలను చేరదీయడం, నిత్యాన్నదాన కార్యక్రమాలు, అనాథ శవాలకి అంత్యక్రియలు నిర్వహించడం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గొప్పసంకల్పంతో మనశ్శాంతి కోవెల ఆశ్రమ ఏర్పాటుకు స్థల సేకరణ చేయడం గొప్ప విషయమని, తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఇందూరు యువత అధ్యక్షుడు చిట్టిమిల్ల హరిప్రసాద్, రజనీష్, దారం గంగాధర్, రత్నాకర్, సుమీల, సూజాత, సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, ఆయా కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతరం నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



వార్షికోత్సవంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మోర్తాడ్ ముసలమ్మ చెరువును నింపాలి

- చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం పెట్‌పల్లి పంప్‌హౌజ్‌ను ప్రారంభించాలి
- ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



నీటి పారుదల శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం షెట్‌పల్లి పంప్‌హౌజ్‌ను త్వరగా ప్రారంభించాలని, మోర్తాడ్ ముసలమ్మ చెరువును నింపాలని తద్వారా ముసలమ్మ చెరువు నుంచి బషీరాబాద్ కాడి చెరువుకు నీళ్లు ఎత్తిపోయాలని నీటి పారుదల శాఖ అధికారిని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే శనివారం పర్యటించి పలువురిని పరామర్శించారు. బషీరాబాద్‌కు చెందిన రైతులు కాడి చెరువును ఎత్తిపోతల ద్వారా నింపాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా, ఆయన నీటిపారుదల శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సారెస్పీలో నీరు పుష్కలంగా ఉండడంతో చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపే అవకాశం ఉన్నందున షెట్‌పల్లి పంప్‌హౌజ్‌ను ప్రారంభించాలని ఆదేశించారు. తద్వారా ముసలమ్మ చెరువు నుంచి బషీరాబాద్ కాడి చెరువులోకి నీటిని వదలాలని సూచించారు.

ఎస్ఎస్ఆర్ కళాశాలకు న్యాక్ గుర్తింపు



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ (బిప్లస్‌ప్లస్ గ్రేడ్) గుర్తింపు వచ్చిందని విద్యా సంస్థ చైర్మన్ మారయ్యగౌడ్ తెలిపారు. కళాశాలలో డైరెక్టర్లతో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలను 1993లో స్థాపించామని, నాటి నుంచి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. న్యాక్ బృందం సభ్యులు మూడు రోజులపాటు కళాశాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారని, తమ కళాశాలకు న్యాక్ గుర్తింపు ఇస్తున్నట్లు ఢిల్లీ నుంచి శనివారం ఈ మెయిల్ వచ్చినట్లు తెలిపారు. ఎంతోమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్న తమ కళాశాలకు న్యాక్ గ్రేడ్ బి ప్లస్ ప్లస్ గుర్తింపు రావడం ఎంతో గర్వకారణమన్నారు. మరింత మెరుగైన విద్యనందించేందుకు కృ షి చేస్తామన్నారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను జోడిస్తూ విద్యనందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామన్నారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలు, ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ హరితాగౌడ్ పాల్గొన్నారు.

డీసీసీబీలో మాజీ చైర్మన్ ఫొటో ఎక్కడ?



సుభాష్‌నగర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో మాజీ చైర్మన్ల ఫొటోలు పెట్టడం ఆనవాయితీ. ఈ సాంప్రదాయానికి ప్రస్తుతం నిజామాబాద్ డీసీసీబీ అధికారులు మంగళం పాడారు. గత నాలుగేళ్లపాటు డీసీసీబీ చైర్మన్‌గా సేవలందించిన పోచారం భాస్కర్‌రెడ్డి ఫొటోను ఉద్దేశపూర్వకంగా ఏర్పాటు చేయడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న రమేశ్‌రెడ్డి పట్టించుకోకపోవడం కారణంగానే ఈ పరిస్థితి అని ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విమర్శలు చేస్తున్నారు. కేవలం పోచారం భాస్కర్‌రెడ్డిని అవమానించాలనే ఉద్దేశంతోనే ఫొటో ఏర్పాటు చేయాలనే సాంప్రదాయానికి బ్రేక్ వేశారంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఫొటో ఏర్పాటు చేయాలని డైరెక్టర్లు కోరుతున్నారు.

క్రైం కార్నర్

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్‌కు చెందిన వివాహిత కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోరబోయిన రాజమణి(57) అనే వివాహిత పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబ సభ్యులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలోని ఇందిరాకాలనీకి చెందిన కాదరి కుమార్ (40) అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామునా ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుమార్ తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



బాల్కొండ: అనారోగ్యంతో బాధపడుతూ ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన బొ ప్పారం ముత్తెన్న (48) సౌదీ అరేబియాలో మృతి చెందగా, ఆయన మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరింది. గత కొంత కాలంగా సౌదీఅరేబియాలో ఉంటున్న ముత్తెన్న నెల రోజుల క్రితం అనారోగ్యంబారిన పడడంతో అక్కడి ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. గల్ఫ్‌కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు, పోతుగంటి సాయేందర్ రాష్ట్ర ప్రభుత్వ అధికారి చిట్టిబాబుతో మాట్లాడి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి, మృతదేహన్ని స్వగ్రామానికి చేర్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ముత్తెన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బైక్ చోరీ కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగుంట కాలనీకి చెందిన బాలేరావ్ నరేందర్‌కు చెందిన బైక్‌ను చోరీ చేసిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. తన స్ప్లెండర్ ప్రో బైక్ (ఏపీ 25ఏహెచ్ 3972)ను దుండుగు ఎత్తుకెళ్లారని నరేందర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. కుసుమ సాయికుమార్ అనే వ్యక్తి బైక్‌చోరీకి పాల్పడినట్లు గుర్తించామని, నిందితుడిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయం పక్కన నివాసం ఉండే కొట్టూరి సుశీల ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. సుశీల మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లిందన్నారు. శనివారం ఆమె ఇంటికి వచ్చిన సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, ట్రంకు పెట్టెలో దాచిన అరతులం బంగారంతోపాటు రూ.10వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఇంట్లో ఉన్న విలువైన దుస్తులను దహనం చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

పెర్కిట్‌లో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పెర్కిట్‌లో ఓ మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గోలుసును లాక్కెళ్లారు. పెర్కిట్‌కు చెందిన మహిళ తన ఇంటికి వెళ్తున్న సమయంలో స్కూటీపై వచ్చిన ఇద్దరు దుండగులు వెనుక నుంచి మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఒక్కొక్కటిగా బయటికి..

- మానిక్‌బండార్ వెంచర్‌లో అక్రమాలెన్నో..
- ఇప్పటి వరకు మూడుసార్లు విచారణ పూర్తి
- ఎండోమెంట్ భూమి ఉన్నట్లు నిర్ధారణ

సాక్షి ఎఫెక్ట్..



మానిక్‌బండార్ వెంచర్‌లో సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

మాక్లూర్: మండలంలోని రెండో డివిజన్ పరిధిలో ఉన్న మాణిక్‌బండార్ శివారులో 217 ఎకరాల్లో వెలిసిన ప్రైవేట్ వెంచర్‌లో పేదల భూములతోపాటు ఇరిగేషన్, దేవాదాయ భూమి సుమారు 5 ఎకరాల వరకు కబ్జా అయినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. విలీన గ్రామాల అభివృద్ధికి వెచ్చించాల్సిన రూ.10కోట్ల టీయూఎఫ్‌డీసీ నిధులను దారి మళ్లించి వెంచర్ కోసం రెండు వంతెనలను నిర్మించారు. ప్రైవేట్ వెంచర్‌లో అక్రమాలపై గతంలో అధికారులకు స్థానిక కార్పొరేటర్ రాయ్‌సింగ్ ఫిర్యాదు చేశారు. అలాగే వెంచర్‌లో అక్రమాలపై 'సాక్షి' కథనాలను ప్రచురించింది. దీంతో పనులను కొద్దికాలం నిలిపివేసి మళ్లీ ప్రారంభించారు. ఇటీవల కార్పొరేటర్ రాయ్‌సింగ్ మళ్లీ సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, రెండోసారి కూడా 'సాక్షి'లో మరో కథనం ప్రచురితమైంది. శనివారం నాటితో అధికారులు మొత్తం మూడుసార్లు సర్వే చేశారు. అధికారులు తేల్చాల్సింది టీయూఎఫ్‌డీసీ నిధులు రూ.10 కోట్ల దుర్వినియోగంపైనే అని పలువురు అంటున్నారు. ప్రభుత్వ నిధులను వెంచర్‌కు కేటాయించిన అప్పటి ప్రజాప్రతినిధికి రియల్టర్లు కొంత భూమిని గిఫ్ట్‌గా ఇచ్చారనే ఆరోపణలున్నాయి. శనివారం నిర్వహించిన విచారణలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీ, సర్వేయర్ కిషన్ నాయక్, కార్పొరేటర్ రాయ్‌సింగ్, సాగునీటి సంఘం మాజీ చైర్మన్ ప్రభు ఉన్నారు.

చెరుకు లారీ బోల్తా



రోడ్డు పక్కన బోల్తాపడిన చెరుకు లారీ

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ శివారులో చెరుకు లారీ బోల్తా పడింది. మహారాష్ట్ర నుంచి చెరుకు లోడ్‌తో నిజాంసాగర్ మండలంలోని ఫ్యాక్టరీకి వెళ్తుండగా శుక్రవారం రాత్రి కల్లూర్ గ్రామ శివారులో అదుపుతప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

బల్దియా వాటర్ ట్యాంకర్..



బోల్తా పడిన ట్రాక్టర్ ట్యాంకర్

కామారెడ్డి క్రైం: డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో అదుపు తప్పి బల్దియా వాటర్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటన జిల్లా కేంద్రంలోని హైదబాద్ రోడ్‌లో శనివారం చోటుచేసుకుంది. హౌసింగ్ బోర్డు వైపు నుంచి నిజాంసాగర్ చౌరస్తా వైపు వస్తున్న ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్ ప్రమాదవశాత్తు బోల్తా పడగా డ్రైవర్ రవికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వెంటనే ట్యాంకర్‌ను పక్కకు తీయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ఘటనాస్థలంలో క్షతగాత్రులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ మూల మలుపు వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్‌లోని ఓ దుకాణంలో పనిచేస్తున్న ఇస్సాపల్లి గ్రామానికి చెందిన ఇట్టెం శ్రీధర్ ముప్కాల్‌లో పని ఉండటంతో వన్నెల్‌దాస్ గంగాధాంతో కలిసి బైక్‌పై శనివారం వెళ్లాడు. తిరిగి వస్తున్నక్రమంలో చేపూర్ క్రాసింగ్(చౌరస్తా) ఆర్మూర్ నుంచి చేపూర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్న రాజేశ్వర్ వేగంగా వచ్చి శ్రీధర్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో గంగారాం తల, చేతులకు తీవ్రగాయలు కాగా శ్రీధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని ఎస్సై మహేశ్ పరిశీలించారు. బాధితులను 108 అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలోపడి మృతి

మాచారెడ్డి: డప్పు రిపేర్ చేయించుకునేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటి కుంటలోపడి మృతి చెందాడు. ఈ ఘటన పాల్వంచ మండలం మంతన్‌దేవునిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గుండెల్లి దేవరాజు(39) అనే యువకుడు ఈ నెల 25న తన డప్పు రిపేర్ చేయించుకునేందుకు కామారెడ్డికి వెళ్లాడు. ఆ రోజు రాత్రి వరకు ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి పాల్వంచ శివారులోని చామల కుంటలో దేవరాజు శవమై కనిపించినట్లు ఎస్సై తెలిపారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెంది ఉంటాడని ఎస్సై అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత

డిచ్‌పల్లి(మోపాల్): అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను మోపాల్ మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరి శనివారం తెలిపారు. టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేటలో శనివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన నేకపు నర్సయ్య పెంకుటిల్లు దగ్ధమైంది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు వ్యాపించిన వెంటనే నర్సయ్య కుటుంబ సభ్యులు బయటికి వచ్చేశారు. ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి.

సమ్మె నోటీసు అందజేత



కామారెడ్డి టౌన్: సివిల్ సప్లయ్ హమాలీల డిమాండ్ల పరిష్కారం కోసం జనవరి 1నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు తెలిపారు. కలెక్టరేట్‌లోని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి భిక్షపతికి సమ్మె నోటీసును శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హమాలీలకు కూలీ రేట్లను పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, కల్పించాలని ఎన్నో పోరాటాలు చేసిన ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. దీంతో సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. దశరథ్, హమాలీలు బాబ్జీ, మైపాల్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.